క్లుప్తంగా

ఆరోగ్య కేంద్రాలను ఉపయోగించుకోండి



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ సేవలను అందరూ ఉపయోగించుకోవాలని ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి కోరారు. పినపాడులోని డాక్టర్ వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ ల్యాబ్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఆయన వెంట ల్యాబ్ టెక్నిషియన్ కమలాకర్ గుప్తా ఉన్నారు.

కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడిగా రామస్వామి



తెనాలిటౌన్: బీజేపీ అనుబంధ విభాగం కిసాన్ మోర్చా తెనాలి మండలాధ్యక్షుడిగా నందివెలుగు గ్రామానికి చెందిన కానుగోలు రామస్వామి నియమితులయ్యారు. ఈ మేరకు నందివెలుగులోని మిద్దె సెంటర్‌లో శనివారం జరిగిన కార్యక్రమంలో రామస్వామికి నియామక పత్రాన్ని జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు తోటకూర కోటీశ్వరరావు అందజేశారు. మండలంలోని రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. మోది ప్రభుత్వం రైతులకు ప్రవేశపెడుతున్న పథకాలను తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో టి.శ్రీనివాసరావు, జి.వెంకటనారాయణ, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

20 నుంచి శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు



తెనాలిటౌన్: షరాఫ్ బజార్‌లోని సువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో ఈ నెల 20 నుంచి 26వ తేదీ వరకు శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి అవుతు శ్రీనివాసరెడ్డి తెలిపారు. బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక పోస్టర్‌లను శనివారం ఆలయ ఆవరణలో ఆవిష్కరించారు. 20న స్వామివారిని పెళ్లి కుమారుడు చేయుట, 21న సీతారాముల కల్యాణం, 22న సూర్యప్రభ వాహన సేవ, రాత్రి చంద్రప్రభ వాహన సేవ, 23న శ్రీమైనాక వాహన సేవ రాత్రి గజవాహన, గరుడ వాహన సేవ ఉంటుందన్నారు. రాత్రి సువర్చలా హనుమత్ కల్యాణం, 24న మధ్యాహ్నం శ్రీవారి రథోత్సవం, 25న చక్ర స్నానం, పూర్ణాహుతి, 26న ఉదయం పుష్పోత్సవం ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు శ్రీనివాసమూర్తి, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

నిర్మాణ పనుల పరిశీలన

తెనాలిటౌన్: తెనాలి వ్యవసాయ మార్కెట్ యార్డు ఆధునీకరణలో భాగంగా ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేస్తున్న ఎడ్ల బండి, రైతుల విగ్రహ నిర్మాణ పనులను శనివారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పరిశీలించారు. ఈ నెలాఖరు నాటికి ప్రారంభించే విధంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. మున్సిపల్, మార్కెట్ కమిటీ నిధులతో ఎడ్ల బండి, రైతు విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నట్లు మార్కెట్ కమిటీ కార్యదర్శి జేవీ సుబ్బారావు తెలిపారు. మార్కెట్ కమిటీ చైర్మన్ సీత నగేష్‌రెడ్డి, పార్టీ నాయకులు బూరెల దుర్గాప్రసాద్, గుదిబండి రమేష్‌రెడ్డి, ఆరిగ చంద్రారెడ్డి, ఉడుముల మహేష్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

29న భావనారుషి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం

మంగళగిరి: పట్టణంలోని నాంచారమ్మ చెరువులో నూతనంగా నిర్మించిన భద్రావతి సమేత భావనారుషి స్వామి వార్లతో పాటు గణపతి, లక్ష్మీదేవి, సరస్వతి అమ్మవార్ల దివ్య విగ్రహ ప్రతిష్టామహోత్సవం ఈనెల 29వ తేదీన వైభవంగా నిర్వహించనున్నట్లు పట్టణ పద్మశాలీయ బహూత్తమ సంఘం ప్రతినిధులు తెలిపారు.

కృష్ణానదిలో మునిగి వ్యక్తి మృతి

తాడేపల్లి రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని కృష్ణానది ఎగువ ప్రాంతంలో కృష్ణానది ఉండవల్లి కరకట్ట వెంబడి కొండవీటి వాగు ఎత్తిపోతల పథకం వద్ద యువకుడు నీటిలో మునిగి మృతిచెందాడు. సీఐ మధుసూధనరావు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ అయ్యప్పనగర్‌కు చెందిన కుంచెం లోకేష్‌రావు (27) ఓ ఇన్సూరెన్సు కంపెనీలో పనిచేస్తుంటాడు. శనివారం భార్య కమలకుమారి, ఇద్దరు పిల్లలతో కలిసి సరదాగా ఈత కు కృష్ణానదిలో దిగారు. లోకేష్‌రావు నీటిలో మునిగిపోవడంతో భార్య, పిల్లలు పెద్దగా కేకలు వేశారు. చుట్టుపక్కలవారు మునిగిపోయిన లోకేష్‌ను నీటిలో నుంచి బయటకు తీయగా, అప్పటికే మృతిచెందినట్లు గుర్తించారు. ఘటనపై భార్య కమలకుమారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మధుసూధనరావు తెలిపారు.

ఇంతకంటే భరోసా ఎవరు ఇవ్వగలరు..

- ఆర్‌బీకేలతో ఊరిలోనే పలు రకాల వ్యవసాయ సేవలు
- విత్తు నుంచి ఎరువుల వరకు అన్ని అందుబాటులో
- రైతులకు వ్యవసాయ సూచనలతోపాటు పంటల సాగుపై అవగాహన



ముననంగి గ్రామంలోని రైతు భరోసా కేంద్రం(ఫైల్ ఫొటో)



కొల్లిపర మండలంలో రైతు భరోసా లబ్ధిదారులు..

సంవత్సరం	రైతులు	రైతు భరోసా నగదు(రూ.ల్లో
2019-20	7,414	10,00,89,000
2020-21	8,031	10,84,18,500
2021-22	8,652	11,68,02,000
2022-23	7,507	10,13,44,500
2023-24	7,350	9,92,25,000
మొత్తం	38,954	52,58,79,000

కొల్లిపర: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి వ్యవసాయానికి పెద్ద పీట వేసింది. అన్నదాత ఆనందంగా ఉంటే అందరూ సుభిక్షంగా ఉంటారనే నమ్మకంతో అడుగడునా అండగా నిలిచింది. వ్యవసాయ పరంగా ఉన్న ఊరిలోనే అన్ని రకాల సేవలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో వ్యవసాయాన్ని పండగలా మార్చారు. ఆర్బీకేల్లో విత్తనాలు, ఎరువుల వరకు అందిస్తున్నారు. పంట ఉత్పత్తులకు మద్దతు ధర కల్పించి అక్కడే కొనుగోలు చేస్తున్నారు. వారం పది రోజుల్లో రైతుల ఖాతాలకు నేరుగా నగదును జమ చేస్తున్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు పంటల సాగు విషయంలో ఎప్పటికప్పుడు అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నారు.

గ్రామంలోనే అన్ని సేవలు..

ఆర్బీకేలు ఏర్పాటు చేయకముందు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల కోసం రైతన్నలు మండల కేంద్రానికో లేక తెనాలి, జిల్లా కేంద్రానికో వెళ్లాల్సి వచ్చేది. మార్కెట్లో ఎరువుల దుకాణంలో ఎక్కువ ధరకు పెట్టి ఎరువు కొనుగోలు చేయాల్సి వచ్చేది. పంట ఉత్పత్తులను దుళారులు చెప్పిన రేటుకే విక్రయించుకోవాలి. దూర ప్రాంతంలో ఉన్న మిల్లుల వద్దకే వెళ్లాలి. ప్రస్తుతం ఆర్బీకేల్లో విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు అందుతున్నాయి. రైతులు సాగుచేస్తున్న పంటలకు ఈ-క్రాఫ్ బుకింగ్ చేస్తున్నారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం జరిగినప్పుడు వేగంగా నష్టం అంచనా వేసి, పరిహారం అందేలా సిబ్బంది పనిచేస్తున్నారు. వ్యవసాయ సహాయకులను రైతులకు అన్ని విధాలుగా అండగా నిలుస్తున్నారు.

మండలంలో ఆర్బీకేలు ఇలా..

మొత్తం ఆర్‌బీకేలు :	15
సొంత భవనాలు :	1
ప్రారంభానికి సిద్ధంగా ఉన్నవి :	1
ప్రభుత్వ భవనాల్లో ఉన్న ఆర్బీకేలు :	13

ఎరువుల వివరాలు

సంవత్సరం	మెట్రిక్ టన్నుల్లో
2021-22	2,390
2022-23	2,441
2023-24	2,562
మొత్తం	7,393

విత్తన వివరాలు

సంవత్సరం	క్వింటాల్లో
201-920	120
2020-21	128
2021-22	135
2022-23	32
2023-24	37.52
మొత్తం	452.52

ఆర్బీకేల ద్వారా అందిస్తున్న సేవలు

- ఆర్‌బీకేల్లో అగ్రికల్చర్, హార్టికల్చర్, సెరికల్చర్, విలేజ్ ఫిషరిస్ అసిస్టెంట్లు సేవలందిస్తున్నారు.
- రైతులకు సబ్సిడీ విత్తనాల గ్రామస్థాయిలోనే అందజేస్తున్నారు.
- గ్రామ స్థాయిలో రైతులకు సర్టిఫైడ్ హామీతో కూడిన ఇన్‌పుట్‌లను సరఫరా చేస్తున్నారు.
- ఈ-క్రాఫ్ బుకింగ్‌లో సాగులోని పంట, రైతుల సమాచారం నమోదు.
- రైతులకు పంట సాగుదారుల హక్కు . ధృవీకరణ పత్రం జారీ.
- గ్రామస్థాయి విత్తన సేకరణ కార్యకలాపాలు, ఎంఎస్పీ, మార్కెట్ ఇంటిలిజెన్స్ సమాచారం అందించడం.
- పీఎం కిసాన్, వైఎస్సార్ రైతు భరోసా, వంటి పంట రుణాల కోసం డేటా అప్‌లోడ్ చేయడం.
- విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు , పశువుల దాణా సరఫరా.
- వివిధ పథకాల కింద లబ్ధిదారుల సామాజిక తనిఖీ, ప్రకృతి వైపరీత్యాలు, సబ్సిడీ విత్తనాలు మొదలైనవి.
- డిజిటల్ లైబ్రరీ ద్వారా తెగుళ్లు, వ్యాధులపై రైతులకు అవగాహన.
- పొలంబడి, సీడ్ విలేజ్ ప్రోగ్రాం, మినీకిట్ ట్రయల్ ప్లాట్లు మొదలైన ఫ్లాగ్‌షిప్ ప్రోగ్రామ్‌ల నిర్వహణ.
- విత్తన పరీక్ష (భౌతిక స్వచ్ఛత, ఆకురోత్పత్తి పరీక్ష).
- రైతుల సామర్థ్యాన్ని పెంపొందించడం, ఉత్తమ నిర్వహణ పద్ధతుల వ్యాప్తి, పొలంబడి, పద్ధతి ప్రదర్శనలు.
- పంటల నిపుణల ద్వారా సాంకేతిక సెషన్ల ప్రత్యక్ష ప్రసారం.
- ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ, జంతువుల ప్రథమ చికిత్స, ట్రావిస్.

కష్టాలు తప్పాయి...



రైతు భరోసా కేంద్రాలు వచ్చాక రైతులకు చాలా వరకు కష్టాలు తగ్గాయి. గతంలో వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉన్న సమయంలో ఎరువులకు, పురుగు మందులకు మండల కేంద్రాలకు, తెనాలికి పరుగులు పెట్టేవాళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదు. ఆర్బీకేల్లోనే.. ప్రభుత్వ ధరకు ఎరువులు, విత్తనాలు లభిస్తున్నాయి.

– మర్రెడ్డి బ్రహ్మారెడ్డి, మాజీ సర్పంచ్, తూములూరు.

ఏటా రైతు భరోసా..



ఆర్బీకేలో ఈ-క్రాప్ ద్వారా పంటలను సకాలంలో నమోదు చేస్తున్నారు.ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు నష్ట పరిహారం వెంటనే అందుతోంది. ఏటా రైతు భరోసా నగదు నా బ్యాంకు ఖాతాకు జమవుతోంది. పంటల సాగు సమయంలో విత్తనాలు, ఎరువులకు డబ్బు సమస్య లేకుండా పోయింది.

– లంకిరెడ్డి బాస్కర్‌రెడ్డి, రైతు, వల్లభాపురం.

ఆర్బీకేల ద్వారా అన్ని రకాల సేవలు



రైతులకు వ్యవసాయ పరంగా అన్ని రకాల సేవలను రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్నాం. పంటల సాగు సమయంలో సూచనలు, సలహాలు ఇస్తున్నాం. పంటలకు చీడపీడలను ఆశించినప్పుడు వాటిని పాటించడంతో రైతుకు పంట నష్ట తీవ్రత తగ్గుతోంది.

– కె.వెంకటరావు, వ్యవసాయశాఖాధికారి, కొల్లిపర.

తెనాలి సబ్ జైలు మూసివేత

త్వరలో రూ.3.30కోట్లతో నూతన భవన నిర్మాణం ప్రారంభం



శిథిలావస్థకు చేరుకున్న సబ్‌జైలు భవన సముదాయం

తెనాలిరూరల్: తెనాలి సబ్‌జైలును అధికారులు శనివారం మూసివేశారు. సబ్‌జైలు భవన సముదాయం శిథిలావస్థకు చేరుకోవడంతో అధునాతన భవనాన్ని నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో జైలులో ఉన్న ముగ్గురు మహిళా ఖైదీలను గుంటూరు జైలుకు, 23 మందిని రేపల్లె సబ్ జైలుకు, 10 మందిని బాపట్ల సబ్ జైలుకు తరలించారు. ప్రస్తుతం ఉన్న సబ్ జైలును బ్రిటిష్ పాలకులు 1912లో నిర్మించారు. శిథిలావస్థకు చేరుకున్న భవన సముదాయంలోనే ఖైదీలు ఉంటున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం జైళ్ల సంస్కరణపై దృష్టి సారించింది. ఈ క్రమంలో సుమారు 110 ఏళ్ల క్రితం నిర్మించిన తెనాలి సబ్‌జైలు స్థానంలో అధునాతన సౌకర్యాలతో కూడిన జైలును నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో జైళ్లశాఖ డీజీ హసన్ రెజా తెనాలి జైలును గతేడాది సెప్టెంబరులో పరిశీలించారు. ఈమేరకు రూ.3.30 కోట్లతో నిర్మాణ పనులు ప్రారంభించేందుకు అన్ని అనుమతులు లభించాయి. ఈ నేపథ్యంలో సీనియర్ ఐపీఎస్ అధికారి, హోంశాఖ ముఖ్యకార్యదర్శి, ఇన్‌చార్జి డీజీ(జైళ్ల శాఖ) హరీష్‌కుమార్ గుప్తా నవంబర్ 29వ తేదీన శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఉన్న సబ్‌జైలుకు అవకాశం ఉన్నమేర అదనంగా కొంత స్థలాన్ని సమకూర్చి దేశంలోనే మోడల్ జైలుగా తెనాలి సబ్‌జైలు నిర్మాణం జరపాలని అధికారులు భావిస్తున్నారు. మరి కొద్దిరోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభం కానున్నాయి.

వలంటీర్లను బిడ్డలుగా భావిస్తున్న లబ్ధిదారులు

- అంత గొప్పగా విధులకు అంకితమయ్యారు
- వారి సేవలకు ప్రతిపక్ష నేతల వక్రభాష్యం
- ఎక్కడెక్కడో ఉంటూ ఎన్నికలప్పుడు వచ్చేస్తున్నారు
- 'వలంటీర్లకు వందనం'లో ఎమ్మెల్యే శివకుమార్



సేవా వజ్ర పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: గ్రామ, వార్డు వలంటీర్ల వ్యవస్థ ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉంటోందని, ప్రభుత్వం అందించే సంక్షేమాన్ని ఎలాంటి అవినీతి లేకుండా పారదర్శకంగా అర్హులకు అందజేయటంలో వలంటీర్ల పనితీరు అద్భుతమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. వలంటీర్లను తమ బిడ్డలుగా లబ్ధిదారులు భావించేంత గొప్పగా తమ సేవలకు అంకితమయ్యారని అభినందించారు. పట్టణంలోని 1-20 వార్డుల వరకు వలంటీర్లకు వందనం సభను శనివారం స్థానిక మున్సిపాలిటీ ఆధ్వర్యంలోని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో నిర్వహించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక అధ్యక్షత వహించారు. ఎమ్మెల్యే శివకుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తన మెరుగైన పనితీరుకు వలంటీర్ల వ్యవస్థ కూడా ఒక ప్రధాన కారణమన్నారు. వలంటీర్లతో పరిపాలన విధానాన్ని ప్రజల ముంగిటకు చేర్చటం ద్వారా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా ప్రభుత్వమనే గొప్ప మార్పుకు నాంది పలికారన్నారు. వలంటీర్ల సహకారంతోనే ప్రతి నెలా ఒకటో తేదీన నియోజకవర్గంలోని 37 వేలమందికి పింఛన్లు ఇస్తున్నామని గుర్తుచేశారు. 27 వేలమంది పేదలకు ఇళ్లస్థలాలను ఇచ్చి, రిజిస్ట్రేషన్లు కూడా చేయిస్తున్నామని చెప్పారు.

ఎన్నికలప్పుడే వస్తారు..!

టీడీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీచేయబోతున్న ఎన్నారై పెమ్మసాని చంద్రశేఖర్‌కు బుర్రిపాలెంలో ఉన్న ఇంటికి, జనసేన నేత నాదెండ్ల మనోహర్‌కు పెదరావూరులో గల ఫార్మ్‌హౌస్‌కు సమీపంలోనే జగనన్న కాలనీలు ఉన్నాయన్నారు. అమెరికాలో, హైదరాబాద్‌లో ఉంటూ ఎన్నికల వేళకు మాది తెనాలి అంటూ వస్తారని ప్రతిపక్ష నేతల నుద్దేశించి ఘాటు వ్యాఖ్యలు చేశారు. జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ తెనాలి ఎమ్మెల్యేగా, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ స్పీకర్‌గా ఉన్న పదేళ్ల కాలంలో తెనాలిలో ఎంత మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చింది చెప్పాలని ఎమ్మెల్యే శివకుమార్ నిలదీశారు. నాలుగేళ్ల పది నెలల కాలంలోనే తాను 27 వేలమందికి ఇళ్లస్థలాలను ఇచ్చినట్లు చెప్పారు. అధికారంలోకి వస్తే ఉద్యోగాలను కల్పిస్తానని మనోహర్ వాగ్దానం చేస్తున్నారనీ, పదేళ్లు అధికారంలో ఉన్నప్పుడు ఎవరికైనా ఉద్యోగాలు ఇప్పించారా? చెప్పాలంటూ సవాల్ విసిరారు. ఎన్ని ఫ్యాక్టరీలు తెప్పించారో కూడా చెప్పాలన్నారు. నియోజకవర్గంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి తన హయాంలోనే ఉద్యోగాలను ఇచ్చినట్లు స్పష్టంగా చెప్పారు. ఇవన్నీ వాస్తవాలనీ, నియోజకవర్గ ప్రజలు ఎవరు నిజాలు చెబుతున్నారు? ఎవరు మభ్యపెడుతున్నారు? అనేది తెలుసుకోగలరని అన్నారు. మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, వైస్ చైర్మన్లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే శివకుమార్ చేతుల మీదుగా వలంటీర్లకు పురస్కారాలను అందజేశారు. వివిధ కార్పొరేషన్ల డైరెక్టర్లు మన్నవ ప్రభాకర్, కావేటి నిర్మల, రాళ్లబండి సుష్మ, కౌన్సిలర్లు తోట రఘురామ్, కొర్రయశోద, దాసరి వీరవసంతరావు, పెచ్చింగ్ సుభాని, పార్టీ నాయకులు తాడిబోయిన రమేష్, బూరెల దుర్గాప్రసాద్, కఠారి హరీష్, చుండూరు సాయి, ఉడుముల మహేష్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మందపాటి శేషగిరిరావు పాల్గొన్నారు.

లైంగిక వేధింపులకు పాల్పడితే చర్యలు తప్పవు



సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీధర్

తెనాలిరూరల్: ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో లైంగిక వేధింపుల నిరోధక చట్టం గురించి న్యాయ అవగాహన సదస్సు శనివారం సాయంత్రం తెనాలి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్ మాట్లాడుతూ లైంగిక ప్రయోజనాల కోసం కార్యాలయాల్లో వేధింపులకు గురిచేయడం, అభ్యర్థించడం, అశ్లీల చిత్రాలు చూపడం వంటి పలు విషయాలు వేధింపులుగా పరిగణించబడతాయని వెల్లడించారు. ఇటువంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అంతేకాక పని ప్రదేశాలలో అంతర్గత ఫిర్యాదుల కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. ఫిర్యాదులు దాఖలు చేయడానికి విధివిధానాలు అమలు చేయాలని, దర్యాప్తు ప్రక్రియలు పాటించని వారికి జరిమానాలు, శిక్షలు విధించమని చట్టం నిర్దేశిస్తుందని న్యాయమూర్తి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మందలపు వేణుగోపాలరావు, మండల ప్రజా పరిషత్ అధికారి కాటూరి శిల్ప, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రతాపరెడ్డి, మండల సేవాధికార సంస్థ కమిటీ కో-ఆర్డినేటర్ షేక్ మహబూబ్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేస్తే భారీ మెజారిటీ

'బ్రేక్‌ఫాస్ట్ విత్ ఎమ్మెల్యే' సమావేశంలో ఎమ్మెల్యే శివకుమార్



పార్టీ నేతలతో ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ శ్రేణులు గెలుపే లక్ష్యంగా సమన్వయంతో పని చేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. 'బ్రేక్‌ఫాస్ట్ విత్ ఎమ్మెల్యే' కార్యక్రమంలో భాగంగా రెండోరోజు శనివారం పట్టణ 11, 22 వార్డుల నేతలతో ఎమ్మెల్యే శివకుమార్ బ్రేక్ ఫాస్ట్ చేశారు. వార్డుల్లో పార్టీ గెలుపు అవకాశాలు, మెజార్టీ ఎంత ఉంటుందనే అంశాలను తెలుసుకున్నారు. మరింత భారీ మెజారిటీ సాధనకు చేయాల్సిన కసరత్తును గురించి చర్చించారు. సమన్వయంతో పని చేస్తే భారీ మెజారిటీ తథ్యమని అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా పేద, మధ్యతరగతి వర్గాల ప్రజలకు సంక్షేమ లబ్ధిని అందించిందని చెప్పారు. ఏనాడూ ప్రభుత్వం నుంచి రూపాయి సాయం అందని అగ్రవర్ణాల పేదలకు కూడా ఈబీసీ నేస్తం కింద ఆర్థిక సాయం అందించిన వైనాన్నీ ప్రత్యేకంగా ప్రస్తావించారు. ప్రతిపక్షాలవి.. ఉత్తుత్తి హామీలేనని, ఎన్నికల ముందు హామీలివ్వటం, తర్వాత అమలు చేయక పోవటం టీడీపీకి అలవాటేనని చెప్పారు. పట్టణంలో మరో అయిదు వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్లను ఏర్పాటు చేసి పట్టణ ప్రజలకు ఉచిత వైద్యం, పరీక్షలు, మందులను అందచేస్తున్నట్టు చెప్పారు. వీటన్నిటినీ ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. షేక్ దుబాయ్‌బాబు, కఠారి హరీష్, పోతావఝుల పురుషోత్తమశర్మ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సేకరణలో లోపాలు లేకుండా చూడండి

మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక



పూడికతీత పనులు పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: చెత్త సేకరణలో ఎటువంటి లోపాలు తలెత్తకుండా చూడాలని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక సూచించారు. పట్టణంలోని 3వ వార్డులో శనివారం ఆమె పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలో మూడు బుట్టల విధానాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు. ప్రజలు కూడా తడి, పొడి, హానికర చెత్తను వేర్వేరుగా అందజేయాలని సూచించారు. ఆమె వెంట కౌన్సిలర్లు ఆవుల కోటయ్య, ఆరోగ్యాధికారిణి డాక్టర్ కె.హెలెన్ నిర్మల, ఆర్ఐ మోహన్‌కృష్ణ, ఏఈ ఫణీంద్ర, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు తాడిబోయిన రమేష్ తదితరులున్నారు.

నిరుద్యోగులకు సాఫ్ట్‌వేర్‌లో ఉచిత శిక్షణ

మంగళగిరి: మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు సాఫ్ట్‌వేర్‌లో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వంగర సురేష్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఐబీఎస్ ప్రెస్‌క్లబ్ భవన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కృష్ణా, ఎన్టీఆర్, పశ్చిమగోదావరి జిల్లాలో విద్యార్థులకు సాఫ్ట్‌వేర్‌లో ఉచితశిక్షణ ఇవ్వనున్నామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 70935 29750 నంబరులో సంప్రదించాలని కోరారు. రవికుమార్, ఆదినారాయణ, రమేష్, శ్రీనివాస్, కోటేశ్వరరావు, భాను ప్రదీప్, వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

తెనాలిఅర్బన్: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్స్‌కు రావాల్సిన డీఏ బకాయిలను, పీఆర్‌సీ అరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల జేఏసీ తెనాలి చైర్మన్ డి.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఏపీ జేఏసీ పిలుపు మేరకు ఏపీఎన్‌జీవో తెనాలి యూనిట్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం చినరావూరులోని ధర్నాచౌక్ వద్ద ఆందోళన చేశారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఉద్యోగ సంఘ నాయకులు ఎస్.రామచంద్రరావు, డీవీ సుబ్బారావు, సాంబశివరావు, ఎ.రామచంద్రరావు, బి.కృష్ణమోహన్, సీహెచ్ విద్యాసాగర్ పాల్గొన్నారు.

రోగులకు రొట్టెల పంపిణీ



రొట్టెలు, పండ్లు అందజేస్తున్న పల్నాటి నాగరాజు

తెనాలి: స్థానిక పాత ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలోని వైఎస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్‌లో శనివారం హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ముంబయి) తరఫున రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. కౌన్సిల్ కోస్తాంధ్ర అధ్యక్షుడు పల్నాటి నాగరాజు, నన్నపనేని సునీల్, వసంతం పవన్‌కుమార్, హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ బి.బి.జాను, వైద్య సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం అర్బన్ హెల్త్ సెంటర్ పనితీరును అడిగి తెలుసుకుని, అక్కడి వైద్య పరికరాలు, ల్యాబ్‌ను సందర్శించారు. నాగరాజు మాట్లాడుతూ అర్బన్ హెల్త్ సెంటర్‌లో 9 రకాల వైద్య సేవలు, 64 రకాల పరీక్షలు చేస్తుండటాన్ని అభినందించారు. విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి ముఖ్యమని చెబుతూ తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సారథ్యంలో ఆయా రంగాల్లోని ప్రగతిని ప్రశంసించారు.

రేపు నందివెలుగులో పాస్టర్ల సమావేశం

తెనాలిటౌన్: నందివెలుగు ఇందిరా కాలనీలో యెహోవా ఈరే మందిరంలో సోమవారం ఉదయం 8 గంటలకు తెనాలి రూరల్ మండలం పాస్టర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు పాస్టర్ ఎం.బర్నబాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ముఖ్య నాయకులు సమావేశంలో పాల్గొంటారని, తప్పక హాజరు కావాలని పేర్కొన్నారు.

అక్కపై చెల్లి దాడి..

కొల్లిపర: అక్కా చెల్లి గొడవలో అక్కకు గాయాలైన ఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం కొల్లిపర గ్రామానికి చెందిన అక్కాచెల్లెళ్లు రంపాటి లక్ష్మి, మరిపూడి పద్మ మధ్య గొడవ జరిగింది. లక్ష్మిని తన చెల్లి పద్మ, ఆమె కొడుకు శ్రావణ్‌కుమార్ కర్రతో కొట్టగా తలకు గాయాలయ్యాయి. లక్ష్మిని కుటుంబ సభ్యులు తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఆర్.రవీంద్రరెడ్డి విలేకరుల సమావేశంలో తెలిపారు.

బీజేపీ జాతీయ మహిళా మోర్చా కార్యదర్శిగా దీపిక



కొల్లిపర: బీజేపీ పార్టీ జాతీయ మహిళా మోర్చా కార్యాలయం కార్యదర్శిగా కొల్లిపర గ్రామానికి చెందిన ఆరుమళ్ళ దీపిక నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా మండల బీజేపీ నాయకులు శనివారం ఆమెకు అభినందనలు తెలిపారు. దీపిక మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి నిత్యం కృషి చేస్తానన్నారు.